ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 3 సెప్టెంబరు 2024


కొల్లూరు : పెసర్లంకలో మంచినీటి కోసం పడవ వద్దకు వరద నీటిలో వెళుతున్న యువకులు


కొల్లూరు : గాజుల్లంకలో నీట మునిగిన గృహాలు


భట్టిప్రోలు: వరద నీరు ముంచెత్తడంతో రెండవ అంతస్తులోకి ఓ కుటుంబం

లంక గ్రామాలన్నీ..
జల దిగ్బంధం


దాచేపల్లి: రామాపురంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


అమరావతి: వైకుంఠపురంలో అర్ధరాత్రి వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్, ఎస్పీ శ్రీనివాసరావు


వరద ముంపులో అమరావతిలోని పల్లపు వీధి


కొల్లూరు వద్ద వరద ప్రభావిత ప్రాంతాలను మ్యాప్ ద్వారా మంత్రి గొట్టిపాటి, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఆనందబాబుకు వివరిస్తున్న కలెక్టర్

ఎటు చూసినా వరద నీరు. అంతా చిమ్మ చీకటి. అడుగు బయటకు పెట్టాలంటే భయం. పాములు, విష కీటకాలతోనే సహజీవనం. వీటన్నిటికీ తోడు వరదలకు ముందే గ్రామాలకు గ్రామాలు జ్వరాలతో మంచం పడితే, ఇప్పుడు వారికి వరద నీటిలో మందులు అందక, కొన్ని గ్రామాల్లో తాగటానికి గుక్కెడు నీరు దొరక్క వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతమే. కృష్ణా నదీ వరద ముంపు లంక గ్రామాల్లో పరిస్థితి ఇదీ. రెండు రోజుల నుంచి వరద ముంచెత్తి, ఊళ్ళను చుట్టుముడితే అంతగా వరద ప్రభావం ఉండదని భరోసాతోఉన్న స్థానికులు చాలామంది పశువులను వదిలేసి, ఇళ్లనుంచి బయటకు రావటానికి ఇష్టపడ లేదు. 2009 తర్వాత ఇంత భారీ స్థాయిలో కృష్ణా నదికి వరద వచ్చిందిలేదు. 2009లో తమ ఇళ్లు భద్రమని, మునగలేదు కనుక తమ ఇళ్లలోనే ఉండొచ్చని ధీమాగా ఉన్న వారంతా ఇప్పుడు భయపడిపోతున్నారు. ప్రకాశం బ్యారేజి నుంచి సోమవారం మధ్యాహ్నం నుంచి కూడా 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వస్తూనే ఉంది. ఎగువ బ్యారేజీల నుంచి వరద నీరు తగ్గినా, మునేరు, పాలేరు, కీసర, బుడమేరు వాగులు ఇంకా పొంగి ప్రవహిస్తూనే ఉండటంతో అధికారులు కూడా ఒక అంచనా వేయలేకపోయారు. వరద ప్రవాహ వేగం కూడా అంచనాలేకపోవటం, అరవింద వారధి దగ్గర చిన్నపాయ అడ్డుకట్ట తెగిపోవటంతో ఒకేసారి వరద నీరంతా ఊళ్లపై పడటంతో మరింత నష్టం ఏర్పడినట్టయింది. దీంతో వరద నీటి ప్రభావం సోమవారం భారీగా పెరగటంతో నీరు చేరని ఇల్లే లేదంటే అతిశయోక్తి కాదు.

బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు గుప్పిటపట్టి..

- చుట్టూ చిమ్మచీకటి... పాములతో సహజీవనం
- వరద నీటిలోనే లంక గ్రామవాసులు
- జ్వరాలతో పడకేసి... మందులులేక దిక్కుతోచక
- సాయం అందించాలన్నా కష్టమైపోయింది..

తెనాలి, బాపట్ల, రేపల్లె, కొల్లూరు, కొల్లిపర సెప్టెంబరు 2, (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి దిగువన తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని లంక గ్రామాలన్నీ జలదిగ్బంధంలోనే చిక్కుకుపోయాయి. అయితే ఈ ప్రాంతాలకు పగలు కొద్దిసేపు, రాత్రి కొంత సమయం విద్యుత్తు సరఫరా ఇస్తుండటం, కొన్ని గ్రామాలకయితే రెండు రోజుల నుంచి విద్యుత్తు లేకపోవటంతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. రాత్రయితే చుట్టూ చీకటి కమ్మేసి ఉండటం, అంతా నీరు నిండిపోవటంతో పొలాలపై, పొదల్లో ఉన్న విష సర్పాలు, కీటకాలు ఇళ్లలోకి చేరిపోతున్నాయని వారు ప్రాణ భయంతో చెబుతున్నారు. నీటిలో వాటిని ఏమీ చేయలేకపోతున్నామని, వాటితో కలసి సహజీవనం చేయటం మినహా చేసేదేమీలేకుండా ఉందనేది బాధితుల ఆవేదన. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం కనిగిరిలంక వాసులను నది మధ్య నుంచి కొల్లూరు మండల కేంద్రానికి తరలించేందుకు పడవపై ప్రయత్నం చేస్తే అది చెట్టుకు ఢీకొని పెద్ద ప్రమాదమే తప్పింది. దీంతో అధికారులు కూడా వారిని ఇంతటి ప్రవాహ వేగం ఉన్న తరుణంలో బయటకు తీసుకురావటం ఇబ్బందిగా మారటంతో ఆహార పొట్లాలను లంక గ్రామాలకే పంపుతున్నారు. అయితే అవన్నీ కొన్ని గ్రామాలకు, కొన్ని ఇళ్లకే అందుతున్నాయని, మిగిలినవారు ఆకలితోనే అలమటించాల్సి వస్తోందని వాపోతున్నారు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం మొత్తం వరద ముంపులో చిక్కుకుపోయింది. అక్కడి నుంచి 50 మందికిపైగా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే లోపల ఉన్న లంకల నుంచి బయటకు తీసుకురావటానికి అధికారులు భయపడాల్సిన పరిస్థితి. ఇటు కొల్లూరు మండలంలోనూ కరకట్టకు దగ్గర్లోఉన్న పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, పోతార్లంక, జువ్వలపాలెం, కిష్కింధపాలెం, తిప్పలకట్ట, భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, మరికొన్ని గ్రామాల వారినికూడా దరికి చేర్చలేని పరిస్థితి. వారికి అవసరమైన ఆహారం, తాగునీటి సరఫరాకే అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ఆహార పొట్లాలు గ్రామాల్లో సచివాలయాల దగ్గర పెట్టేసి వెళ్లటం, కొన్ని పొట్లాలు ప్యాకింగ్ కూడా లేకుండా పంపటంతో తినటానికి పనికిరాకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార పొట్లాలు ఆలస్యం కావటం, పొట్లాలు సరిగాలేకపోవటంపై ఎమ్మెల్యే ఆనందబాబు అధికారులపై మండిపడ్డారు. మీకు కుదరదంటే కార్యకర్తలతో పంపుతానని, పనిచేయలేనివారు వెళ్లిపోవచ్చని సిబ్బందిని హెచ్చరించారు. అయితే వీటితోపాటు మందులు, వైద్య సిబ్బందిని కూడా గ్రామాలకు పంపగలిగితే బతుకుతామని, లేకుంటే వరద భయంతోపాటు, రోగాలతో చనిపోతామని వారు కన్నీరుమున్నీరవుతున్నారు.


పెసర్లంక : వరద నీటిలో కుటుంబం


అమరావతి ప్రాంతంలో వరదలో కొట్టుకుపోతున్న పడవలు


సాగర్ జలాశయం గేట్లు ఎత్తి నీటి విడుదల


దాచేపల్లి : నీటమునిగిన రామాపురం మత్స్యకారుల కాలనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని


నరసరావుపేట మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జెడీ ఐ మురళీ

21 వేల ఎకరాల్లో
పంట నష్టం

- వ్యవసాయ శాఖల ప్రాథమిక అంచనా

నరసరావుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు పల్నాడు జిల్లాలో పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో పంట పొలా లు ముంపునకు గురయ్యాయి. పొలాల్లో నీరు నిలిచిపోయి పంటలు ఉరకెత్తుతున్నాయి. కాపు దశలోనే పత్తి పంట దెబ్బతిన డంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో 21,150 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు ఉద్యాన, వ్యవసాయ శాఖలు ప్రాథమికంగా అంచనా వేశాయి.

వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 20,005 ఎకరాల్లో పత్తి, వరి, కంది తదితర పంటలకు నష్టం వాటిల్లింది. మొత్తం 176 గ్రా మాల పరిధిలో పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. పత్తి పంట 17 మండలాల్లో 109 గ్రామా ల పరిధిలో దెబ్బతిన్నది. 17,320 ఎకరాల్లో పత్తి పంటకు న ష్టం వాటిల్లింది. 12 మండలాల పరిధిలోని 56 గ్రామాల్లో 2,175 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. 350 ఎకరాల్లో కంది, 37.5 ఎకరాల్లో జూట్, 82.5 ఎకరాల్లో మినుము పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ జేడీ ఐ మురళీ సోమవారం వివరించారు.

ఉద్యాన పంటలకూ భారీగానే నష్టం వాటిల్లింది. 1,163 ఎకరాల్లో అరటి, పసుపు, మిరప తదితర పంటలకు నష్టం వాటిల్లిందని ఉద్యాన శాఖ తెలిపింది. పిడుగురాళ్ల, ముప్పాళ్ల మండలాల్లో పసుపు పంట దెబ్బతింది. నరసరావుపేట, గురజాల, అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు, చిలకలూరిపేట, సత్తెనపల్లి మండలాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. 663 ఎకరాల్లో మిరప, పసుపు 292 ఎకరాల్లో, అరటి 44 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు అధికారులు వివరించారు.

వరద ప్రభావం వారసత్వ అమరావతి మీద పడింది. అమరావతి నుండి విజయవాడ, గుంటూరు, క్రోసూరు వైపు వెళ్లే రహదారులలో కూడా వరద ప్రభావంతో వాహనాల రాకపోకలు నిలిచిపో యాయి. మండల పరిధిలోని పెద మద్దూరు, వైకుంఠపురం గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వారసత్వ నగర మైన అమరావతిలోని పలు ప్రాంతాలకు వరద నీరు చేరింది. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మండల అధికారులు పడవల మీద తిరుగుతూ బాధితులకు భరోసా కల్పించారు. అమరావతి- విజయవాడ రహదారిలో పెదమద్దూరు, వైకుం ఠపురం వరకు రహదారి వరద ముంపులో మునిగిపోవడంతో విజయవాడ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. అమరావతి గుంటూరు రహదారిలో నరుకుళ్ళపాడు ఎండ్రాయి గ్రామాల మధ్య వరద నీరు రోడ్డుపైకి చేరడంతో వాహనాల రాక పోకలు నిలిపి వేశారు. అమరావతి క్రోసూరు మార్గం లో దిడుగు గ్రామం వద్ద వరద నీరు రహదారిపై కి చేరడంతో వాహ నాలు నిలిచిపోయాయి.


నరసరావుపేట ప్రాంతంలో నీటిలో నానుతున్న పత్తి పంట

గోలి వాగు గండి పూడ్చివేత

మాచర్ల గుంటూరు ప్రధాన రహదారి రెంటచింతలలోని గోలి వాగు చప్టాపై ఏర్పడిన గండ్లను ఎన్‌హెచ్ అధికారులు ఆదివారం రాత్రి 11 గంటల 30 నిమిషాలకల్లా పూడ్చి వేశారు.దీంతో రాకపోకలు మొదలయ్యాయి. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం రాత్రి వరకు వాగుకు ఇరువైపులా వందలాది వాహనాలు 32 గంటల పాటు ఆగిపోయాయి.దీంతో లారీ డ్రైవర్లు, క్లీనర్లు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్నారు.

దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలోని కృష్ణానది ఒడ్డున వున్న పల్లెకారుల కాలనీ నీటమునిగింది. అందులో నివశిస్తున్న 50 కుటుంబాల వారిని రామాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి తరలించారు. ఎమ్మెల్యే యరపతినేని పాఠశాలలో వుంటున్న పల్లెకారులను పరామర్శించారు.

తాడేపల్లి : కృష్ణానదిపై రైలు వంతెనలను తాకుతూ ప్రవహిస్తున్న వరద నీరు




గండ్ల భయంతో... ఉరుకులు పరుగులు

కృష్ణా నదికి వరద ప్రవాహం ఇప్పటి వరకు నదీతీరంలోని గ్రామాలనే భయపెడితే, కృష్ణా కుడి కరకట్ట వెలుపలఉన్న గ్రామాలవాసులనూ కంటిపై నిద్రలేకుండా వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ప్రకాశం బ్యారేజి దిగువున కొల్లిపర మండలం వల్లభాపురం మొదలుకుని సముద్రం అంచునున్న రేపల్లె మండలం లంకెవానిదిబ్బ వరకు కరకట్ట వెంటున్న గ్రామాల వారికి కరకట్ట బలహీనత కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. గతంలో ఓలేరు దగ్గర పడిన గండికి దగ్గర్లోనే మరో రెండు రేట్ల కరకట్ట పైనుంచి నీరు ప్రవహిస్తుండటం ప్రస్తుతం అదరినీ భయపెడుతున్న విషయం. కరకట్ట ఆధునికీకరణ పనులు ఇక్కడ జరగకపోవటంతో మనిషి వెళ్లటానికి కూడా వీలులేని విధంగా కరకట్ట ముళ్ల చెట్లతో, కుంగిపోయి ఉంది. దీంతో కృష్ణానదికి సోమవారం 11.43 లక్షల క్యూసెక్కుల వరద రావటంతో పెదపులివర్రు దగ్గర, పల్లెపాలెం దగ్గర కరకట్ట అంచులకుపైగా నీరు ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తమైన స్థానికులు పొక్లెయిన్, ట్రాక్టర్లతో మట్టిని తీసుకొచ్చి అడ్డుగా పోయటం, ఇసుక మూటలు వేసేందుకు రోజంతా శ్రమిస్తూనే ఉన్నారు. అయినా వరద నీటి లీకేజిని మాత్రం ఆపలేకపోయారు. నీరు చిన్నపాటి జాలుగా కరకట్టకు బయటవైపున్న బ్యాంక్ కెనాల్‌లోకి జారిపోతూనేఉంది.

ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు వదులుతున్న వరద నీరు సోమవారం మధ్యాహ్నానికి 11.43 లక్షల క్యూసెక్కుల నుంచి 11.27 క్యూసెక్కులకు తగ్గింది. అటు పులిచింతల నుంచి కూడా నిన్నటి వరకు 6 లక్షల నుంచి 6.5 లక్షల వరకు వదిలిన వరద నీటి స్థాయిని సోమవారం 5.43 లక్షలకే తగ్గించారు. అటు మునేరు నుంచికూడా 2.4 లక్షల క్యూసెక్కుల వరకు వచ్చిన వరద 44వేల క్యూసెక్కులకు తగ్గిపోయింది. కీసర నుంచి మాత్రమే 2 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి నీటి విడుదలలో వ్యత్యాసం కనిపించినా, దిగువున మాత్రం వరద ఉధృతి తగ్గటం లేదు. సోమవారం అమావాస్య గడియలు ప్రవేశించటంతో సముద్రం పోటెత్తుతోందని అధికారులు చెబుతున్నారు. సోమవారం అనేకచోట్ల నుంచి వరుసగా కరకట్టకు గండ్లు పడుతున్నాయంటూ అధికారులకు ఫోన్ కాల్స్ రావటంతో అటూ ఇటూ పరుగులుపెట్టారు. గత ప్రభుత్వం కృష్ణా నదికి ఐదేళ్లలో పలుమార్లు వరద వచ్చినా, కరకట్ట భద్రత, దానిని పటిష్టపరచాలనే ఆలోచనకూడా చేయకపోవటంతో ఇప్పుడు దాని ప్రభావం తీర గ్రామాలపై పడుతోంది.

- అమరావతిలోని ద్యానబుద్ద వద్ద వరద ముంపులో బుద్ధవనం




వరద ముంపులో అమరావతి పోలీస్ స్టేషన్


- క్రోసూరు చెరువుకట్టకు గండి పడి రోడ్డుపైకి ప్రవహిస్తున్న వరదనీరు





కిడ్స్ డైట్

అమ్మ చేతి గోరుముద్ద!

పిల్లలు తినడానికి మొండికేస్తారు. అయిష్టత ప్రదర్శిస్తారు. బలవంతం చేస్తే ఏడ్చేస్తారు. అలాగని వదిలేస్తే పిల్లలకు పోషకాలు అందేదెలా? ఇలాంటప్పుడు పిల్లలకు బలవర్ధక ఆహారం మీద ఇష్టం పెరిగే చిట్కాలు పాటించాలి!

పిల్లల పోషకాహారం గురించిన అవగాహన తల్లుల్లో పెరగడం అభినందనీయమే! అయితే ఆ ఆహారంలో విటమిన్లు, ఖనిజలవణాలు, మాంసకృత్తులు, పిండిపదార్థాలు ఉండేలా సరి చూసుకోవడమూ అవసరమే! అయితే అవన్నీ ప్రాంతీయపరమైన, సంప్రదాయపూరితమైన, రుతుపరమైన ఆహార పదార్థాలేనా? మనం తినే ఆహారం, నివసించే వాతావరణాలతో మన అనుబంధం కాలక్రమేణా బలహీనపడుతోంది. ఇప్పటికి పదేళ్ల వెనక్కు వెళ్తే ఏ ఇంట్లో చూసినా పప్పు, అన్నంతో కూడిన భోజనమే తినేవాళ్లం. పిల్లలూ వాటినే ఇష్టంగా తినేవాళ్లు. కానీ ఇప్పుడు పోషకాల మీద పెరిగిన అవగాహన మూలంగా, పిండిపదార్థాలు, కొవ్వులను దూరం పెట్టేస్తున్నాం. ఏం కొంటున్నా, లేబుల్ పరీక్షించి, కేలరీలు లెక్కిస్తున్నాం. కానీ ఇలాంటి విపరీతమైన అప్రమత్తత వల్ల ఎక్కువ సందర్భాల్లో విలువైన పోషకాలకు దూరమవుతున్నాం. ఫిట్‌గా ఉండడానికి బదులు లావుగా తయారవుతున్నాం, తేలికగా జబ్బుల బారిన పడుతున్నాం. పోషకాలను బట్టి ఆహారాన్ని ఎంచుకునే ధోరణి వల్ల లాభపడేది ఆహార సంస్థలే! ప్రజల ఆరోగ్యానికి ఈ ధోరణి ఏమాత్రం ప్రయోజనకారి కాదు. కాబట్టి మరీ ముఖ్యంగా పిల్లలకు ఇచ్చే ఆహారం విషయంలో అమ్మమ్మల నాటి పాతవి, ఆరోగ్యకరమైన పద్ధతులనే ఎంచుకోవాలి.

అమ్మమ్మల ఆహారం!

ప్రపంచం మొత్తంలో స్థూలకాయం కలిగిన పిల్లలున్న దేశంగా భారతదేశం రెండవ స్థానంలో ఉంది. అంతమాత్రాన మనం పిల్లలు, వారి ఆహారపుటలవాట్లను అశ్రద్ధ చేస్తున్నామని కాదు. నిజానికి వారి ఆహారం పట్ల మనం అవసరానికి మించిన శ్రద్ధ ప్రదర్శిస్తున్నాం. పోషకాలున్న ఆహారం అది ప్రాంతీయమైనది కాకపోయినా, వెతికి వెతికి తినిపిస్తున్నాం. కానీ మన అమ్మలు, అమ్మమ్మలు ఇలా చేయలేదు. ఏ రుతువులో కాచే కాయలను ఆ రుతువుల్లో తినిపించారు. పొట్టు తీయని ధాన్యాలు, పెరట్లో పండిన కూరగాయలు, పళ్లు అందించారు. అప్పట్లో వంటగది ఇంటి మధ్యలో ఉండేది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వంటింట్లోకి వెళ్లి ఆహారం అందుకుని తినేటందుకే ఈ ఏర్పాటు. పాలు, పెరుగు, కమ్మని వెన్న, నెయ్యి, జున్నులు ప్రతి ఇంట్లో తాజాగా, సిద్ధంగా ఉండేవి. సున్నుండలు, అరిసెలు లాంటి బలవర్థకైన చిరుతిళ్లు డబ్బాల్లో నింపి ఉంచేవారు. సెనగపప్పు ఉండలు, వేరుశనగ చెక్కలు, బెల్లం జిలేబీలు...ఇవన్నీ రక్తవృద్ధిని పెంచే చిరుతిళ్లే! వీటిలో ఎటువంటి ప్రిజర్వేటివ్స్, కృత్రిమ రంగులూ ఉండవు. కానీ ఇలాంటి వంటలు వండే బదులు, పాశ్చాత్య ఆహార పద్ధతులను అనుసరిస్తూ మాంసకృత్తుల కోసం సోయా, అవకాడోల మీద, పీచు కోసం ఓట్స్ మీద ఆధారపడుతున్నాం! వీటికంటే మెరుగైన ప్రత్యామ్నాయ, సంప్రదాయ పదార్థాలు ఎన్నో ఉన్నాయి.

పేచీ పెట్టే పిల్లలతో ఇలా...

కొంతమంది పిల్లలు తినడానికి పేచీ పెడతారు. ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయల పట్ల అయిష్టత ప్రదర్శిస్తారు. ఇలాంటప్పుడు పిల్లలకు ఆ ఆహారం పట్ల ఆసక్తి ఏర్పరిచే ప్రయత్నంచేయాలి. ఇందుకోసం పాలకూరను పెరట్లోనే పెంచాలి. పూల తొట్లలో కొత్తిమీర, పుదీనా, ఆకుకూరల విత్తనాలు చల్లి పిల్లల చేత వాటికి నీళ్లు పోయిస్తూ ఉండాలి. కూరగాయలు, ఆకుకూరలు ఎదిగే క్రమాన్ని పిల్లలు పరిశీలించేలా చేయాలి. అలాగే కూరగాయలు పండించే తోటలకు అరుదుగానైనా పిల్లలను తీసుకెళ్తూ ఉండాలి. పళ్లు, కూరగాయ మొక్కలను పిల్లలు గమనించేలా చేయాలి. ఇలా చేయడం వల్ల ఆ మొక్కల ఉత్పత్తుల పట్ల పిల్లలకు ఆసక్తి పెరుగుతుంది. వాటి వంటలను ఆస్వాదించాలనే కోరిక కూడా పెరుగుతుంది. ఆహారంతో అనుబంధం ఏర్పరచాలంటే పర్యావరణంతోనూ అనుబంధం ఏర్పరచాలి. పెద్దలు ఈ విషయంలో పిల్లలకు మార్గనిర్దేశకులుగా మారాలి. అలాగే బయట భోజనాలకు స్వస్తి చెప్పి, ఇంటి భోజనానికే పెద్దలు కట్టుబడి ఉండాలి. పిల్లలకూ ఆ అలవాటు నేర్పాలి. వంటింట్లో వంటపనిలో నిమగ్నమయ్యే తల్లులను చూసిన పిల్లలు కచ్చితంగా వంటగదిలో తయారయ్యే ఆహారాన్ని ఇష్టపడతారు. అలాగే కుటుంబసభ్యులందరూ నిర్దిష్ట సమయాల్లో కలిసి కూర్చుని భోజనం చేసే కట్టుబాటు అనుసరించాలి. ఆ సమయంలో టివి, సెల్‌ఫోన్ లాంటి వాటికి చోటు ఇవ్వకూడదు.

> **పిల్లల ఆహారం పసందుగా...**
>
> అన్నం, వేరుసెనగపప్పు, నెయ్యి, ఒక పండు, ఇంట్లో తయారైన లడ్డు... ఇదీ పిల్లలకు అనునిత్యం ఇవ్వవలసిన ఆహారం. వీటితోపాటు కూరగాయలు, ఇంట్లో వండిన ఎటువంటి ఆహారమైనా ఇవ్వవచ్చు. చిరుతిళ్లుగా గుప్పెడు వేరుసెనగపప్పులు, తాజా పండ్లు, అటుకుల ఉప్మా, గోధుమరొట్టె, బెల్లం ముక్క, ఇంట్లో తయారైన సున్నుండలు, లడ్లు... ఇలా పోషకభరితమైన చిరుతిళ్లను పిల్లలకు అలవాటు చేయాలి. 'ఫలానా పాఠం తప్పు లేకుండా రాసి చూపిస్తే, చాక్లెట్లు ఇప్పిస్తా!' లాంటి ఆశ పెట్టే పద్ధతులు మానేయాలి. చాక్లెట్లను వారానికి ఒకసారికే పరిమితం చేయాలి. గోధుమ బియ్యంలో పోషకాలు అధికం. అలాగని వాటిని వండి పెడితే పిల్లలు తినడానికి ఇష్టపడరు. కాబట్టి బియ్యంతోపాటు రెండు గరిటెల గోధుమ బియ్యం కలిపి వండి పెట్టవచ్చు. క్యారట్, క్యాప్సికమ్ లాంటి కూరగాయలను అందమైన ఆకారాల్లో కోసి, ఆకర్షణీయమైన అలంకరణతో వడ్డించి, పిల్లల్లో ఆసక్తినీ రేకెత్తించవచ్చు. వీలైనంత వరకూ భిన్నమైన పోషకాలు అందేలా మూడు, నాలుగు కూరగాయలను కలిపి వండవచ్చు. ఇలా పిల్లలకు నచ్చే, వారు మెచ్చే తరహాలోనే ఆహారం పట్ల వారికి ఇష్టాన్ని రెట్టింపు చేయవచ్చు.



పోషకాల చిరుతిళ్లు ఇవే!

పిల్లలకు జంతికలు, గవ్వలు లాంటి నిల్వ పిండిపదార్థాలనే చిరుతిళ్లుగా ఇవ్వవలసిన అవసరం లేదు. పచ్చి కూరగాయ ముక్కలకు ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా జోడించి సలాడ్‌గా అందించవచ్చు. మొలకెత్తిన పెసలు, సెనగలు ఒక టీస్పూన్ నూనెలో వేయించి, క్రంచీగా ఉండడం కోసం వేయించిన వేరుసెనగ పప్పులు చల్లి, నిమ్మరసం కలిపి అందించవచ్చు. షియా విత్తనాలు నానబెట్టి, పండ్ల ముక్కలు, తేనె కలిపి తినిపించవచ్చు. కీర దోస లేదా జుకినిలను పొడవుగా తరిగి, ఉప్పు, చిల్లీఫ్లేక్స్, మొక్కజొన్న పిండి కలిపిన మిశ్రమంలో ముంచి, బ్రెడ్ పొడి అద్ది నూనెలో వేయించి అందించవచ్చు. కూరగాయలు కలిపి ఆమ్లెట్ వేసి ఇవ్వొచ్చు. పులిసిన పిండితో రొట్టెలు, చద్ది అన్నంతో దద్దోజనం లాంటివి కూడా ఆరోగ్యకరమే! ఆవిరి మీద ఉడికించిన చికెన్, చేప ముక్కలు లేదా గ్రిల్ చేసినవీ పిల్లలకు అందించవచ్చు. పండ్లముక్కలతో కస్టర్డ్ తయారుచేసి పెట్టవచ్చు.

ఆకలి తెలియనివ్వాలి

సాధారణంగా భోజన వేళకు పిల్లలు కూడా కడుపు నిండా తినడం అన్నిసార్లూ వీలుపడకపోవచ్చు. అప్పుడప్పుడూ పిల్లల ఆకలి మందగిస్తూ ఉంటుంది. కాబట్టి తినడానికి పేచీ పెట్టినప్పుడు, బలవంతంగా తినిపించే ప్రయత్నం చేయకూడదు. ఆకలి ఉంటేనే పిల్లలకు ఆహారం అందించాలి. భయపెట్టి, బుజ్జగించి తినిపించడం వల్ల తల్లులు ఆశించే ప్రయోజనం నెరవేరకపోవచ్చు. సాధారణంగా తల్లులు, బడికెళ్లే ఈడు వరకూ పిల్లలకు ముద్దలు చేసి తినిపిస్తూ ఉంటారు. కానీ ఈ పద్ధతి కూడా సరికాదు. నడక వచ్చిన వయసు నుంచే పిల్లలు స్వతంత్రంగా తినే అలవాటు చేయాలి. ప్రతి రోజూ ఒకే సమయానికి, ఒకే ప్రదేశంలో తినే ఏర్పాట్లు ఉండాలి. పదార్థాలు నేల మీద పడిపోతాయనో, పిల్లలు చిందరవందర చేస్తారనో, దుస్తులు పాడైపోతాయనో పిల్లలను సొంతగా ఆహారం తిననివ్వకుండా అడ్డుకోకూడదు. పిల్లల కోసం ప్రత్యేకంగా తయారయ్యే స్పూన్లు, ఫోర్కులు, బౌల్స్, ప్లేట్స్‌నే వాడుకోవడం వల్ల వాటితో పిల్లలకు గాయాలు అవకుండా ఉంటాయి. నేల మీద పడినా పగిలిపోకుండా ఉండే పదార్థాలతో తయారైన పాత్రలు, స్పూన్లనే వాడుకోవాలి.

గ్యాస్ వేధిస్తుంటే..

వేళకు తినకపోవడం, తిన్నా అరగకపోవడం చాలా మందికి ఎదురయ్యే సమస్య. వేపుళ్లు, జంక్ ఫుడ్, అధిక నూనెతో వండిన వంటకాలను తినటం వల్ల గ్యాస్ పెరిగి కడుపుబ్బరం సమస్య ఎర్పడుతుంది. దీనికి చిన్న చిట్కాలతో పరిష్కారం లభిస్తుంది. అవేమిటో చూద్దాం..

సమస్య మూలమిది: మనం తిన్న ఆహారం కడుపులోకి వెళ్లిన తరువాత.. జీర్ణం అవుతుంది. ఆ జీర్ణప్రక్రియలో కొన్ని రకాల వాయువులు విడుదలవుతాయి. కొన్ని సార్లు, అవి బయటికి వెళ్లకుండా కడుపులోను, పేవులలోను పేరుకుపోతాయి. అవి చెడువాయువులుగా మారి ఇబ్బంది పెడతాయి. ఆయుర్వేదంలో ఈ సమస్యను ఆర్మానం, ఆటోపం అంటారు. ఈ వాయువులు బయటకు వెళ్లకపోతే ఆ ప్రభావం గుండె.. ఊపిరితిత్తులపై పడుతుంది. గుండె దడ, ఆందోళన, గుండెల్లో నెప్పి మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ప్రతి రోజు క్రమం తప్పకుండా పల్చటి మజ్జిగ తాగితే ఈ సమస్య చాలా వరకూ పరిష్కారమవుతుంది.

చిట్కాలివే: అరిటి బోద లోపల తెల్లటి పదార్థం ఉంటుంది. దీని రసాన్ని రోజుకు ఒక కప్పు చొప్పున 15



రోజులు తాగితే గ్యాస్ సమస్య తగ్గిపోతుంది.

- అల్లం రసం తీసి దానిని వేడిచేసి తగినంత బెల్లం కలపాలి. ఇలా కలిపిన మిశ్రమాన్ని రోజుకు ఒక స్పూను తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కడుపుబ్బరం తగ్గిపోతుంది.
- గింజలున్న ఎండిన నల్ల ద్రాక్షను తీసుకొని నీళ్లలో ఆరు గంటలు నానబెట్టాలి. ఇలా నానిన ద్రాక్ష రసాన్ని తాగితే గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- శొంఠిపొడి, పాత బెల్లంపొడిలను సమ పాళ్లలో కలుపుకోవాలి. ప్రతి రోజూ ఉదయం ఈ మిశ్రమాన్ని ఒక స్పూను తినాలి. ఆ తర్వాత వేడి నీళ్లు తాగాలి. ఇలా తాగితే కడుపులో ఉన్న మలినాలన్నీ తొలగిపోతాయి.
- ధనియాలు, శొంఠిలను సమపాళ్లలో తీసుకొని.. వేడి నీటిలో మరిగించాలి. అలా తయారయిన కషాయాన్ని తాగి నడిస్తే- గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- సోంపు, జీలకర్ర, వాములను సమపాళ్లలో తీసుకొని పొడి చేయాలి. ఈ పొడిని ఉదయం, సాయంత్రం ఒక స్పూను చొప్పున వేడి నీళ్లలో వేసుకొని తాగాలి. ఇలా తాగితే వారం రోజుల్లో గ్యాస్ సమస్య తొలగిపోతుంది.

బ్లడ్ గ్రూప్ డైట్

కార్బ్స్ కావలసిందే!

కార్బ్స్‌ను పూర్తిగా దూరం పెట్టేసే డైట్ ట్రెండ్‌ను విస్తృతంగా అనుసరించేవాళ్లున్నారు. కానీ శక్తిని సమకూర్చే పిండిపదార్థాలను పూర్తిగా మానేస్తే శరీరానికి శక్తి సమకూరేదెలా? మంచి, చెడు పిండిపదార్థాల్లో వేటిని ఏ పరిమాణంలో తీసుకోవాలో అవగాహన ఏర్పరుచుకుని తదనుగుణంగా మసలుకోవాలి.

పిండిపదార్థాలు ప్రధాన పోషకాలు. మనం రోజూ తీసుకునే ఆహారంలో 70% పిండిపదార్థాలే ఉంటాయి. జీర్ణవ్యవస్థ పిండిపదార్థాలను గ్లూకోజ్‌గా మారుస్తుంది. శరీరం ఈ గ్లూకోజ్‌ను కణజాలం, కణాలు, అవయవాల శక్తి కోసం వినియోగిస్తుంది. కాబట్టి శక్తినిచ్చే పిండిపదార్థాలు పూర్తిగా మానేయడం అవివేకం.

పిండిపదార్థాలు లోపిస్తే?

శక్తికి మూలాలైన పిండిపదార్థాలు లోపిస్తే శరీరం పలు లక్షణాల రూపంలో ఆ లోపాన్ని బహిర్గతపరిచే ప్రయత్నం చేస్తుంది. అవేంటంటే...

- నీరసం
- నోటి దుర్వాసన
- మలబద్ధకం
- వాంతులు
- తలనొప్పి
- పోషకలోపం

డి - గ్లూకోజ్

అత్యంత ముఖ్యమైన, కీలకమైన పిండిపదార్థం గ్లూకోజ్. అన్ని జీవరాశులు శక్తి కోసం వాడుకునే సులువైన చక్కెర (మోనోశాఖరైడ్) ఇది. అయితే పిండిపదార్థాలు శరీర బరువును కచ్చితంగా పెంచుతాయి. అవసరం లేని చెడు పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ, అవసరం ఉన్న మంచి పిండిపదార్థాలను పరిమితంగా తీసుకునేవారికి ఈ సమస్య సహజం. కాబట్టి వాటిలో ఏవి మంచి, ఏవి చెడు? అనే విషయం మీద అవగాహన ఏర్పరుచుకోవాలి.



మంచి పిండిపదార్థాలు (కాంప్లెక్స్ కార్బ్స్)

వీటిలోని రసాయన రూపం, పీచులను జీర్ణం చేసుకోవడానికి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చుచేయవలసివస్తుంది. వీటి నుంచి అందే శక్తి శరీరానికి ఎక్కువ సమయంపాటు ఉపయోగపడుతుంది. మంచి పిండిపదార్థాలలో...

- పోషకాలు, పీచు ఎక్కువ
- గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ
- తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండుతుంది
- శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం (మెటబాలిజం) పెరుగుతుంది.

పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్, రొట్టెలు, తృణధాన్యాలు, ఆకుపచ్చని కూరగాయలు, చిలకడదుంపలు, తాజా పళ్లు ఈ కోవకు చెందినవి.

చెడు పిండిపదార్థాలు (సింపుల్ కార్బొహైడ్రేట్స్)

ఇవన్నీ పొట్టు తీసి, పాలిష్ చేసిన పదార్థాలు. వీటిలో సహజసిద్ధ పోషకాలు, పీచు తక్కువ. చెడు పిండిపదార్థాల్లో...

- పీచు, పోషకాలు అతి స్వల్పం
- గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ
- క్యాలరీలు కొవ్వుగా మారతాయి
- అత్యధిక గ్లూకోజ్ స్థాయులు (నీరసం తెప్పిస్తాయి)

చాక్లెట్లు, తీపి పదార్థాలు, తీపి జోడించిన తృణధాన్యాలు, సోడాలు, శీతల పానీయాలు, పొట్టు తీసిన పిండ్లు ఈ కోవకు చెందినవి.

మేలురకం పిండిపదార్థాలు వీటిలో...

ఓట్స్‌తో తయారైన బిస్కెట్లు, నారింజ రసం, యాపిల్, కేరట్లు, టమేటాలు, ఎండుద్రాక్ష, ద్రాక్ష, అరటిపళ్లు.

- **ఓట్‌మీల్:** ఎక్కువ సమయంపాటు శక్తినిచ్చే నిలకడైన పిండిపదార్థం ఇది. నీళ్లు కలిపి తయారుచేసిన ఒక కప్పు ఓట్‌మీల్‌లో 159 క్యాలరీలు ఉంటాయి. 4 గ్రాములు పీచు, 6 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **యాపిల్:** భోజనానికి, భోజనానికి మధ్య తీసుకోవలసిన ఈ అల్పాహార ఫలంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే 4 గ్రాముల పీచు, పెక్టిన్‌లు ఉంటాయి. మాంసకృత్తులు పుష్కలంగా ఉండే వేరుసెనగపప్పుతో తయారయ్యే వెన్నతో కలిపి తీసుకుంటే ప్రయోజనకరం.
- **చిలకడదుంపలు:** ఇది నిజమైన 'సూపర్ ఫుడ్'. కప్పు చిలకడదుంప ముక్కల్లో 7 గ్రాముల పీచు, అత్యధిక విటమిన్ ఎ, సిలు, 4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **మినుములు:** ఒక కప్పు ఉడకబెట్టిన పొట్టు తీయని మినుముల్లో 15 గ్రాముల పీచు, అంతే పరిమాణంలో మాంసకృత్తులు ఉంటాయి. ఇంత పరిమాణంలో పోషకాలు మరే పదార్థంలోనూ ఉండవు.
- **టమేటాలు:** వీటిలో విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలం. పీచుతో పాటు లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంటు కూడా వీటిలో ఉంటాయి.

● కరకట్టల పటిష్టతను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
● వాటి సమీపంలో గతంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
● నేడు నీటి ప్రవాహ ఉద్ధృతికి విస్తృతంగా లీకులు
● తీవ్ర భయాందోళనలో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు
● బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయిన 30 గ్రామాలు

గత పాపం.. నేటి శాపం..!


బాపట్ల : లంక గ్రామాల్లో చిక్కుకున్న తమ వారి వివరాలు తెలుసుకోవడానికి వెల్లటూరు కరకట్ట వద్దకు చేరుకున్న బంధువులు


బాపట్ల: ఓలేరు కరకట్టకు మరమ్మతులు


రేపల్లె : ట్రాక్టర్ ద్వారా కరకట్టపై వేస్తున్న ఇసుక బస్తాలు

బాపట్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాలనలో కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ఉన్న కరకట్టల పటిష్టానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా కరకట్టల సమీపంలో కూడా నిబంధనలు ఉల్లంఘించి యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకున్న ఘనత గత వైసీపీ ప్రభుత్వానిది. 2019 ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా కరకట్టలను బలోపేతం చేయడానికి ప్రణాళికలు రూపొందించడంతో పాటు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని మాజీ సీఎం జగన్ హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల పాలనలో వాటి పటిష్టానికి ఒక్క రూపాయి విదిల్చిన పాపాన పోలేదు. వాటికి కనీస మరమ్మతులు కూడా ఏళ్ల తరబడి చేయకపోవడంతో అవి లీకుల దశకు కొన్నిచోట్ల, గండ్లుపడి మరికొన్ని చోట్ల ప్రమాదస్థితికి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఎడతెరిపిలేని వర్షాల కుతోడు పైనుంచి వరదనీరు ప్రకాశం బ్యారేజీకి పోటెత్తడంతో రికార్డు స్థాయిలో గత శతాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా 11.5 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో కొల్లూరు, రేపల్లె, భట్టిప్రోలు మండలాల పరిధిలోని 30 లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రకృతి ప్రకోపానికి ఆ గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమం టూ కాలం వెళ్లదీస్తుంటే గత ప్రభుత్వ తప్పిదాలకు కరకట్టలకు లీకులై ఏ క్షణాన గండి పడి మెరకన ఉన్న ఊళ్లను కూడా ముంచెత్తుతాయనే భయం నెలకొంది. ముఖ్యంగా భట్టిప్రోలు మండల పరిధిలో ని పెదపులివర్రు కరకట్టకు పడ్డ లీకులు రేపల్లె ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది

ఓ వైపు నీటమునిగిన లంక గ్రామాలు...

లంకల పరిధిలో ఉన్న 30 గ్రామాల ప్రజలకు ఆదివారం రాత్రి నుంచే బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సోమవారం ఉదయానికి రెండు వేల మందిని పునరావాసా శిబిరాలకు తరలించిన అధికారులు, గ్రామాల్లో చిక్కుకుపోయిన వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్న వారిమీద దృష్టి పెట్టి బయటకు తీసుకొచ్చారు. లంక గ్రామాల్లో కరెంటు సరఫరాను నిలిపివేసి జనరేటర్ల ద్వారా విద్యుత్‌ను అందిస్తున్నారు. వారికి అవసరమైన ఆహారాన్ని పడవల ద్వారా గ్రామాల్లోకి అధికారులు పంపిస్తున్నారు. లంక గ్రామాల్లోకి వెళ్లే మార్గాలను నాలుగు పాయింట్లుగా విభజించి అక్కడ ఇద్దరు అధికారులను ఇన్చార్జిలుగా నియమించారు.

మరోవైపు కరకట్టలకు లీకులు

భట్టిప్రోలు మండల పరిధిలోని పెదపులివర్రు కరకట్టతోపాటు ఓలేరు పల్లెపాలేనికి లీకులు పడడంతో యంత్రాంగం పరుగులు పెట్టింది. ఇసుక బస్తాలు, కంకరతో వాటిని పూడ్చే ప్రయత్నం చేస్తున్నా, పైనుంచి వస్తున్న వరద ప్రవాహం ధాటికి కరకట్టకు సమానంగా నీళ్లు ప్రవహిస్తుండడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న టెన్షన్ అక్కడి ప్రజల్లో నెలకొంది. ముఖ్యంగా పెదపులివర్రు కరకట్టకు గండి పడే ప్రమాదం పొంచి ఉందనీ, అదే జరిగితే ఆ నీరు రేపల్లె పట్టణాన్ని ముంచెత్తే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా రేపల్లె పట్టణ ప్రజానీకాన్ని జిల్లా కలెక్టర్ వెంకటమురళి అలెర్ట్ చేశారు. పెదపులివర్రు కరకట్ట వద్ద జరుగుతున్న పనులను పరిశీలించడానికి వెళ్లిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, జిల్లా కలెక్టర్ వెంకటమురళి ప్రతి గంటకు ఆరా తీసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

రికార్డు స్థాయిలో వరద

10 లక్షల క్యూసెక్కుల వరదను కూడా గతంలో చూసిన లంక గ్రామాల ప్రజలు ప్రస్తుతం వచ్చిన 11.5 లక్షల క్యూసెక్కుల ప్రకాశం బ్యారేజీ ప్రవాహాన్ని శతాబ్ద కాలంలో ఎప్పుడూ చూడలేదని, ఈ స్థాయిలో వరద బీభత్సం ఊహించలేదని లంక గ్రామాల ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు. దిగువకు వస్తున్న వరద ప్రవాహానికి తోడు సముద్రం ఆటుపోట్లు అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు ప్రజలను మరింత కలవరపెడుతున్నాయి. పెదపులివర్రు కరకట్టకు లీకులు ఏర్పడడంతో యంత్రాంగం రేపల్లె ప్రజలను అప్రమత్తం చేసింది. 2009లో ఓలేరు కరకట్టకు గండిపడి నీటి ప్రవాహం ముంచెత్తి ఆనాడు మిగిల్చిన చేదు జ్ఞాపకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

సహాయక చర్యలపై మంత్రి గొట్టిపాటి ఆరా..

వరద ఉద్ధృతికి ముంపునకు గురైన పొలాలతోపాటు కొల్లూరు మండల పరిధిలోని లంక గ్రామాల్లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పర్యటించి బాధితులకు అందుతున్న సహాయంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత బాపట్ల నియోజకవర్గ పరిధిలోని కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో ముంపునకు గురైన పొలాలను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కనీసం కాలువల్లో పూడికతీత కూడా చేపట్టక పోవడం వల్లే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు మంత్రి ముందు వాపోయారు. అన్నదాతలను అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు ఆనంద్‌బాబు, వేగేశన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ ఉన్నారు.


బాపట్ల: పెదపులివర్రు కరకట్ట పరిస్థితిపై వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

పెరుగుతున్న వరద ఉద్ధృతి

రేపల్లె, సెప్టెంబరు 2: కృష్ణానది నుంచి వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. రావిఅనంతవరం, పల్లెపాలెం, మైనేనివారిపాలెం, కనగాలవారిపాలెం, రుద్రవరం గ్రామాల వద్ద కరకట్టలు బలహీనంగా ఉండటంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు కరకట్ట పల్లపు ప్రాంతాల్లో ఇసుక గోతాలతో కట్టలను అభివృద్ధి పరుస్తున్నారు. రావిఅనంతవరం వద్ద ఇసుక కట్టలు వేసినప్పటికీ నీరు కట్టదాటుతూనే ఉంది. అయితే అధికారులు గ్రామస్థులను చైతన్యపరిచి నీరు కట్ట దాట కుండా ఇసుకమట్టితో అడ్డుకట్ట వేస్తూనే ఉన్నారు. బల హీనంగా ఉన్న కరకట్టలను గత ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు. మండలంలోని పల్లెపాలెం గ్రామం పూర్తిగా నీటిలో నిలిచిపోయింది. గ్రామంలోని ప్రజలను బోటు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి వారికి సహాయ, సహకారాలు అందిస్తుంది. పల్లెపాలెంలో మత్స్యకారులు బోటులోనే జీవనం సాగిస్తున్నారు. వరదకు రొయ్యల చెరువులు, పంట పొలాలు ముంపునకు గురై లక్షలాది రూపాయల నష్టం జరిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పెనుమూడి వద్ద ఆంజనేయస్వామి, రావిఅనంతవరం వద్ద శివాలయం, మోర్తోట దేవాలయాలు పూర్తిగా నీటిలో ఉన్నాయి. ఎన్‌జీఆర్ఎఫ్ బృందం, గజఈతగాళ్లు ఎప్పటికప్పుడు వరద ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నారు.


రేపల్లె: పల్లెపాలెంలో పడవలోనే జీవనం


రేపల్లె: పల్లెపాలెం నివాసాల్లోకి వరదనీరు...


బోటులో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న రేపల్లె అధికారులు

కొనసాగుతున్న రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షం తగ్గినా వరద సృష్టించిన బీభత్సం కారణంగా రైల్వేట్రాక్‌లు దెబ్బతినడంతో మంగళవారం కూడా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 12706 సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్‌సిటీని ఈ నెల 3న, 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీని ఈ నెల 4న రద్దు చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం నంబరు. 17015 భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేశారు. 22702 గుంటూరు - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్‌ని కూడా సోమవారం రద్దు చేశారు. ఈ నెల 3న 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి, 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ, ఈ నెల 2 సోమవారం 12703 హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నుమాని రద్దు చేశారు. కాగా ఇంకా రైల్వేట్రాక్ మరమ్మతులు పూర్తి కాని దృష్ట్యా కొన్ని రైళ్లను నడికుడి మార్గంలో మళ్లించనున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. వాటిల్లో నంబరు. 18046 హైదరాబాద్ - షాలిమార్, 12728 హైదరాబాద్ - విశాఖపట్టణం, 12764 సికింద్రాబాద్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 3వ తేదీన పగిడిపల్లి, నడికుడి మార్గంలో నడపనున్నట్లు చెప్పారు.

నాగార్జున సాగర్‌కు పోటెత్తుతున్న వరద

వీపీ సౌత్, నరసరావుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయంకు కృష్ణమ్మ పోటెత్తుతోంది. జలాశయంకు రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చిచేరుతోంది. సాగర్ గేట్లను ఎత్తి 5,40,656 క్యూసెక్లు నీటిని విడుదల చేస్తున్నారు. భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో జలాశయం దిగువ ప్రాంత వాసులను అప్రమత్తం చేశారు. అమరావతి, అచ్చంపేట, రెంటచింత మండలాల్లోని లంక గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నదీ తీరం వైపు వెళ్లకుండా పోలీసు, రెవిన్యూ శాఖలు చర్యలు తీసుకున్నారు. సాగర్ నుంచి నీటి విడుదల ఇంకా పెరగుతుందని అంచనా వేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 586.80 అడుగులకు చేరింది. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకు గానూ 304.46 టీఎంసీలకు నీటి నిల్వ ఉంది. సాగర్‌కు 5,40,656 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. అదే స్థాయిలో సాగర్ 26 క్రస్ట్ గేట్లను 15 అడుగుల మేర ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రతి సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

● పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

నరసరావుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను సోమవారం ఆదేశించారు. ప్రతి గ్రామంలోనూ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి రోగాలు ప్రబలకుండా చూడాలన్నారు. హెల్త్ క్యాంపుల్లో పాము కాటు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో విస్తృతంగా క్లోరినేషన్, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు జిల్లాలో జరిగిన ఆస్తి నష్టం, పశు-పంట నష్టం అంచనా వివరాలను వెంటనే అందించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేపట్టి రాకపోకలు కొనసాగేలా చూడాలన్నారు. పరిస్థితులు మెరుగయ్యే వరకూ పునరావాస కేంద్రాలను కొనసాగించాలన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలల పరిస్థితిని సమీక్షించుకోవాలన్నారు. వర్షానికి దెబ్బతిన్న పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాల్లో విద్యార్థులు ప్రవేశించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని చోట్లా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలన్నారు. జిల్లా అధికారులంతా క్షేత్ర స్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

డ్రోన్ ద్వారా పర్యవేక్షణ

జిల్లా సంయుక్త కలెక్టర్ సూరజ్ సోమవారం అమరావతి మండలంలోని, కృష్ణానది పరివాహక ప్రాంతాల్లోని గృహాలను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించారు. నీరు నిల్వ చేరిన గృహాలను స్వయంగా బోటు ద్వారా ప్రయాణించి, డ్రోన్ సహాయంతో ఏరియల్ వ్యూ, నది ప్రవాహాన్ని పరిశీలించారు.

ఎటువంటి నష్టం జరిగినా సహించేది లేదు


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 2: ఎటువంటి ప్రాణ నష్టం, పశునష్టం జరిగినా సహించేది లేదనీ, అధికారులందరూ వరద ప్రవాహిత ప్రాంతాల్లో 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, అన్నవరంలంక, పిడపర్తిపాలెం, మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో మనోహర్ అధికారులతో కలిసి పర్యటించారు. కృష్ణానదికి వరద ఉద్ధృతి మరింత పెరిగే అవకాశం ఉందని బొమ్మువానిపాలెం, అన్నవరంలంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తక్షణమే తరలించాలని అధికారులకు ఆదేశించారు. అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, పిడపర్తిపాలెం సమీపంలో వరద ఉద్ధృతికి కృష్ణానది కరకట్ట పలుచోట్ల కోతకు గురికావటంతో ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణానదికి వరద పెరుగుతుందని తెలిసి కూడా ఎందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టలేదని వారిపై మండిపడ్డారు. కోతకు గురైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. ఇరిగేషన్, నాయకులు వెంటనే ఇసుకను తోలించడంతో మంత్రి మనోహర్ దగ్గర ఉండి ఇసుకను గోతాల్లో పోయించి కోతకు గురైన చోటవేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కృష్ణానదికి 11లక్షల 60వేల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. మండలంలోని వల్లభాపురం వద్ద కరకట్ట కోతకు గురవుటంతో విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. మంత్రి వెంట సబ్‌కలెక్టర్ సంధ్యా సింహ, జాయింట్ కలెక్టర్ భార్గవ్, డీఎస్పీ బి.జనార్ధనరావు, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

అంతర జిల్లాల దొంగ అరెస్టు


స్వాధీనం చేసుకున్న సొత్తుతో సీసీఎస్ పోలీసులు

గుంటూరు, సెప్టెంబరు 2: అంతర రాష్ట్ర దొంగను మంగళగిరి రూరల్, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం గౌరవరం గ్రామానికి చెందిన తోట శివకుమార్ అలియాస్ శివభవానిని అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.8 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సీసీఎస్ అధికారులు వివరాలు వెల్లడించారు. ఇటీవల మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రబాలెం గ్రామంలో మూడు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. ఆయా కేసుల్లో నిందితులను అరెస్ట్ చేయాల్సిందిగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించడంతో సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. ఆయా చోరీలకు పాల్పడింది శివకుమార్‌గా గుర్తించి అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ. 8 లక్షల ఖరీదైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా విజయనగరం రూరల్, వైజాగ్‌లో భీమిలి, విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడిపై సుమారు 151 పైగా కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ చూపిన క్రైమ్స్ అదనపు ఎస్పీ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీసీఎస్ డీఎస్పీ ఎ.శివాజీ రాజు పర్యవేక్షణలో, సీసీఎస్ సీఐ డి.వెంకన్న చౌదరి, మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్లు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుళ్లు ఎండీ జాని, కె.ప్రసాద్, జి.మల్లేశ్వరరావు, ఎండి గౌస్‌బాషా, కానిస్టేబుల్ ఎండి షబీర్ , ఏఎస్సై షేక్ సుభాని, సీహెచ్ రవికుమార్‌లను ఎస్పీ అభినందించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.95 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

రాజకీయ రంగంలోనూ పవర్‌స్టారే


దుర్గిలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

దుర్గి, సెప్టెంబరు 2: సినీ రంగంలో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసి పవర్‌స్టార్‌గా నిలిచిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్‌కళ్యాణ్ రాజకీయ రంగంలోనూ పవర్‌స్టార్‌గా నిలిచారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం దుర్గి బస్టాండ్ సెంటర్లో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. భారీ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడకు రావాలన్నా పచ్చని చెట్లను కూల్చివేసే వారని, ప్రస్తుతం కూటమి నేతలు పచ్చని చెట్లు పెంచడమే ధ్యేయంగా కృషి చేస్తున్నారని అన్నారు. శవాలు కనిపిస్తే తప్పా జగన్ బయటకు రారని, శవ రాజకీయాల్లో ఆయన దిట్టని అన్నారు. గాడితప్పిన ఆంధ్రను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతగానో శ్రమిస్తుంటే, రాష్ట్రంలో హత్యలు జరుగుతున్నాయంటూ జగన్‌మోహన్‌రెడ్డి రౌడీషీటర్ హత్యతో శవరాజకీయాలు చేయడం సిగ్గు చేటన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. పంగులూరి అంజయ్య, బూసా రామాంజినేయులు, ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్, పులిహరి, తోటకూర శ్రీను, రుద్రాల రవి, కొప్పుల వెంకటరమణ, బీమా అమరయ్య, సూరె కృష్ణ, కటకం రామారావు, సూరె వెంకటేశ్వర్లు, సింగు నాగేశ్వరరావు, జానకి రామయ్య, సూరె బాలసుబ్బారావు, పెద్దిరాజు, కోరె నాగరాజు, పగడాల చెన్నకేశవరావు, శెట్టిపల్లి నరసింహారావు, వెలిదండి శ్రీనివాసరావు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

మిర్చియార్డుకు ఏ క్షణానైనా విజిలెన్స్

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు ఏ క్షణానైనా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలకు వచ్చే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలపై విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌కు అందిన ఫిర్యాదుపై విచారణ జరపాల్సిందిగా డీజీ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో ఇక్కడి అధికారులు అందుకు సన్నద్ధమయ్యారు. ఆరోపణలకు సంబంధించిన ఫైళ్లను స్వాధీనం చేసుకొనే బాధ్యతని ప్రత్యేకించి ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారికి కేటాయించారు. ఒకదశలో సోమవారమే విజిలెన్స్ అధికారులు మిర్చియార్డుకు వస్తారన్న ప్రచారం జరిగింది. అయితే ఏవో అనివార్య కారణాలతో సోదాలను మంగళవారానికి వాయిదా వేసుకొన్నారు. దీంతో ఏమేమి కుంభకోణాలు బయటపడతాయోనన్న ఉత్కంఠ నెలకొంది. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు వారం క్రితం విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తాని కలిసి ఫిర్యాదు చేశారు. అలానే రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుని కూడా కలిసి కంప్లయింట్ చేశారు. యార్డులో ఏటా రూ. 16 వేల కోట్ల మిర్చి అమ్మకాలు జరుగుతాయని, ఇందుకు 1 శాతం సెస్సు లెక్కిస్తే రూ. 160 కోట్లు ఏటా రావాల్సి ఉండగా కేవలం రూ. 80 కోట్ల నుంచి రూ. 100 కోట్ల వరకే వస్తుందన్నారు. దీనికితోడు 5 శాతం జీఎస్‌టీ రావాల్సి ఉండగా ఐదేళ్లలో రూ. 4 వేల కోట్లకు బదులు రూ. 2 వేల కోట్లు మాత్రమే జమ అయిందన్నారు. వైసీపీ హయాంలో కొంతమంది కమీషన్ వ్యాపారస్తులకు ఈ-కొనుగోలు యాప్ ద్వారా షాపులు కేటాయించారు. వాటికి ఎస్ఎఫ్‌టీ ద్వారా అద్దె నిర్ణయించారు. అద్దె ఎక్కువగా ఉందని వ్యాపారస్తులు విజ్ఞప్తి చేయగా భారీగానే ముడుపులు స్వీకరించి 50 శాతం అద్దె మినహాయించారని ఆరోపించారు. 2023లో కమీషన్ వ్యాపారస్తుల లైసెన్సులు సుమారు 400 వరకు రెన్యువల్ చేశారు. దీనికి ఒక్కొక్క వ్యాపారి నుంచి రూ. 25 వేలు మొదలుకొని రూ. 50 వేల వరకు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలానే యార్డులో సుమారు 180 మంది కమీషన్ వ్యాపారస్తులకు సంబంధించిన పార్టనర్‌షిప్ డీడ్‌ని మార్పు చేసి లైసెన్సులు బదిలీ చేయడానికి రూ. లక్షకు పైగా వసూలు చేశారని పేర్కొన్నారు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సిఫార్సుతో కొంతమందికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించారని, వారు ఆఫీసుకు రాకుండా జీతాలు తీసుకొంటున్నారని చెప్పారు. వైసీపీ హయాంలో రైతులకు రూ. 100 కోట్ల మేరకు వ్యాపారస్తులు ఎగ్గొట్టారన్నారు. 2019 జూన్, జూలై, ఆగస్టు నెలల్లో అయితే రూ.15 వేల కోట్ల విలువ చేసే మిర్చి క్రయవిక్రయాలు అక్రమంగా జరిగాయన్నారు. వీటన్నింటిపై విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, మన్నవ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇప్పుడు విజిలెన్స్ విచారణకు సిద్ధమైంది.

32,517 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 35,607 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 32,517 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 18,709 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	15500	334	11000	15500
నెంబరు. 5	8500	14000	నెంబరు. 5	9500	9500
273	12500	12500	273	-	-
341	8000	16000	341	10500	16000
4884	-	-	4884	11000	13000
సూపర్ 10	-	-	సూపర్ 10	9500	10000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18500	తేజ	9000	18300
బ్యాడిగి	8000	14000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	8500	14000	దేవనూరు డీలక్స్	-	-
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	5000	10000

పల్నాడు వార్తలు

32 గంటల పాటు నిలిచిన వాహనాల రాకపోకలు

● ఆదివారం అర్ధరాత్రి గోలి వాగుపై గండిపూడ్చి వేత

రెంటచింతల, సెప్టెంబరు 2: మాచర్ల గుంటూరు ప్రధాన రహదారి రెంటచింతలలోని గోలి వాగు చప్టాపై ఏర్పడిన గండ్లను ఎన్‌హెచ్ అధికారులు ఆదివారం రాత్రి 11 గంటల 30 నిమిషాల కల్లా పూడ్చి వేశారు. దీంతో రాకపోకలు పునరుద్ధరించారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం రాత్రి వరకు వాగుకు ఇరువైపులా వందలాది వాహనాలు 32 గంటల పాటు ఆగిపోయాయి. దీంతో లారీ డ్రైవర్లు క్లీనర్లు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్నారు. ఆర్టీసీ బస్సులను మాత్రం ఆయా డిపోలకు మళ్లించారు. డైవర్షన్ రోడ్డును సీసీ కాంక్రీట్‌తో 1 మీటర్ మందం మేర వేయడం వల్ల పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయి. వాగుకు ఇరువైపులా సేఫ్టీ బారియర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఎన్‌హెచ్‌కు చెందిన ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు.

అధికారుల తీరు ప్రశంసనీయం ఎమ్మెల్యే : బ్రహ్మానందరెడ్డి

మండలంలోని వివిధ వాగులు వంకలు పొంగి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్న సమయంలో అధికారులు వ్యవహరించిన తీరు ప్రశంసనీయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కరుణకుమార్, ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున వారి బృందాన్ని ఫోన్ ద్వారా అభినందించారు.

తాడ్వాయి అడ్డవాగు వద్ద గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు



గల్లంతైన భూక్యా గోపీ కోసం గాలింపు చర్యలు చేపట్టిన మత్స్యకారులు

అచ్చంపేట, సెప్టెంబరు 2: మండలంలోని తాడ్వాయి అడ్డ వాగు వద్ద సోమవారం రాత్రి గల్లంతైన వ్యక్తి కోసం సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి తాడ్వాయి పంచాయతీ పరిధిలోని సంద్ర తండాకు చెందిన భూక్యా గోపీనాయక్ గల్లంతైన విషయం విదితమే. అడ్డవాగుపై సోమవారం వరద నీరు తగ్గుముఖం పట్టింది. ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

పురుగు మందులు స్వాధీనం

సత్తెనపల్లి, సెప్టెంబరు 2 : సత్తెనపల్లి పట్టణంలోని శివశంకర ఫెర్టిలైజర్ పురుగు మందుల షాపును సోమవారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో శ్రీకర్ బయోటెక్ కంపెనీకి సంబంధించిన కొన్ని బయోప్రొడక్ట్స్‌కు జీ-3 సర్టిఫికెట్ సమర్పించనందున 1,73,285 రూపాయల విలువ కలిగిన పురుగు మందుల స్టాక్‌కు తాత్కాలికంగా అమ్మకాలు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అమ్మకాలకు సంబంధించిన పూర్తి వివరాలను షాపుల నిర్వాహకులు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. లేని ఎడల అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి

గురజాలటౌన్, సత్తెనపల్లి, మాచవరం, నకరికల్లు, సెప్టెంబరు 2: పట్టణంలోని జీబీసీ కాలనీలో సోమవారం వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతిని వైసీపీ నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తాలూకా సెంటర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మాచవరం ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుంకలగుంటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి వైసీపీ నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో కందుల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు మండలంలోని లగడపాడులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

సత్తెనపల్లి, సెప్టెంబరు 2: పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.రమేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఇబ్రహీంలు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.


4, 5 తేదీల్లో జన్‌మన్ గ్రామసభలు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 2: మండల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 4, 5 తేదీల్లో జన్‌మన్ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సరోజినిదేవి తెలిపారు. చెంచుల అభివృద్ధి లక్ష్యంగా ఈ గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చెంచులకు చేకూరే ప్రయోజనాలను గ్రామసభల్లో వివరించనున్నట్లు ఆమె తెలిపారు.

ముంపు బాధితులకు స్థలాలిచ్చి ఇళ్లు నిర్మిస్తాం

● నష్టపోయిన వారిని అన్నివిధాల ఆదుకుంటాం

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



రామాపురంలో ఎమ్మెల్యే యరపతినేనితో మాట్లాడుతున్న అధికారులు, గ్రామస్థులు

దాచేపల్లి, సెప్టెంబరు 2: కృష్ణానది వరద ఉధృతితో నష్టపోయిన రామాపురం పల్లెకారులకు ఒక్కొక్క ఇంటికి మూడు సెంట్లు స్థలమిచ్చి పక్కా ఇల్లు నిర్మిస్తామని, సురక్షితమైన ప్రదేశంలో ఇల్లు కట్టించి ఇస్తామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం దాచేపల్లి మండలం రామాపురంలో నాగార్జునసాగర్ నుంచి వచ్చిన వరద నీటితో గ్రామంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న పల్లెకారుల కాలనీ నీటమునిగింది. 50 కుటుంబాల వారిని రామాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి తరలించారు. ఎమ్మెల్యే యరపతినేని పాఠశాలలో ఉంటున్న పల్లెకారులను పరామర్శించారు. వారితో మాట్లాడి వారు పడ్డ ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం కృష్ణానది ఒడ్డున నీటమునిగిన నివాస గృహాలను పరిశీలించారు. ఎవరూ భయపడొద్దని, ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా ఆదుకుంటామన్నారు. 2014-19లో దండివాగు లిఫ్ట్‌ఇరిగేషన్‌కు రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పరిచామని, అభివృద్ధి పనుల్లో భాగంగా లిఫ్ట్‌ఇరిగేషన్ దగ్గర వున్న సిమెంట్ దోనెలను వైసీపీ నాయకులు అమ్ముకొని జేబులు నింపుకోవడం వారి నైజాన్ని తెలియజేస్తుందన్నారు. నడికూడి రైల్వేజంక్షన్‌లో వరంగల్ నుంచి వివిధ రైళ్లు నడికూడి మీదుగా వాటి గమ్యస్థానాలకు చేరుకున్నాయి. నియోజకవర్గంలో కృష్ణానది వరద బాధితులకు ప్రభుత్వ పరంగా సాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ భద్రి, వేముల వినోద్‌రెడ్డి, నర్రా పుల్లయ్య, మునగా నిమ్మయ్య, కొప్పుల గిరి, నెల్లూరి రామకోటయ్య, పురంశెట్టి పరంజ్యోతి, కోరె రామారావు, సొసైటీ నారాయణ తదితరులున్నారు.

కూలిన మట్టి మిద్దెలు

గురజాలటౌన్, సెప్టెంబరు 2: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో నాలుగు మట్టి మిద్దెలు కూలినట్లు తహసీల్దార్ నగేష్ సోమవారం తెలిపారు. మండలంలోని చర్లగుడిపాడులో నాశరమ్మ, తేలుకుట్లలో బత్తుల శ్రీను, రామకృష్ణ, గోగులపాడులో రామకృష్ణారెడ్డిలకు చెందిన మిద్దెలు కూలినట్లు చెప్పారు.

నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు

అమరావతి, సెప్టెంబరు 2: అమరావతి వద్ద కృష్ణానది అంచులు దాటి పొంగి ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాలు, కాలనీలు, పంట పొలాలు నీట మునిగాయి. అమరావతి నుంచి విజయవాడ, గుంటూరు, క్రోసూరు వైపు వెళ్లే రహదారుల్లో కూడా వరద ప్రభావంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మండలపరిధిలోని పెదమద్దూరు, వైకుంఠపురం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. స్థానిక పోలీసుస్టేషన్, తహసీల్దార్ కార్యాలయం వద్ద కూడా వరద నీరు చుట్టు ముట్టింది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మండల అధికారులు పడవల మీద వెళ్లి వారికి భరోసా కల్పించారు. అమరావతి-విజయవాడ రహదారిలో పెదమద్దూరు వైకుంఠపురం వరకు రహదారి వరద ముంపులో మునిగిపోవడంతో విజయ వాడ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. అమరావతి గుంటూరు రహదారిలో నరుకుళ్లపాడు ఎండ్రాయి గ్రామాల మధ్య వరద నీరు రోడ్‌పైకి చేరడంతో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అమరావతి క్రోసూరు మార్గంలో దిడుగు గ్రామం వద్ద వరద నీరు రహదారిపైకి చేరడంతో వాహనాలు నిలిచిపోయాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా కృష్ణానదికి వచ్చిన వరద అధిక వర్షపాతం మండలంలోని అమరావతి, ముత్తాయపాలెం, దిడుగు, పొందుగల, జూపూడి, మునగోడు, పెదమద్దూరు, వైకుంఠపురం, ఎండ్రాయి, నరుకుళ్లపాడు, ఎనికపాడు, ఉంగుటూరు తదితర గ్రామాల్లో వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఆదివారం రాత్రి 2గంటల సమయంలో స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావులు వైకుంఠపురం గ్రామం వెళ్లి స్థానిక ప్రజలకు భరోసా కల్పించారు. గ్రామపరిధిలో ఉన్న కరకట్ట భద్రతకు స్థానికులు ఇసుక బస్తాలను సిద్ధం చేశారు.



తాడువాయి అడ్డ వాగు బ్రిడ్జిపై తగ్గిన వరద నీరు

బాధితులకు ఎమ్మెల్యే ప్రవీణ్ భరోసా

వరద బాధితులకు సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం వరదల వల్ల ముంపునకు గురైన పంట పొలాలలను కాలనీలను పరిశీలించారు. నరుకుళ్లపాడు, ఎండ్రాయి గ్రామాల్లో వరద ముంపును పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అమరావతిలో వరద ముంపునకు గురైన కాలనీలలో పడవ మీద తిరుగుతూ స్థానికులకు ధైర్యం చెప్పారు.

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా పాల్గొని సహాయ కార్యక్రమాలు పర్యవేక్షిస్తుంటే వైసీపీ పేటీఎం బ్యాచ్, నీలి మీడియా చేస్తున్న అసత్య ప్రచారం వారి దుర్మార్గపు ఆలోచనకు నిదర్శనమన్నారు. బాధితులకు సహాయ కార్యక్రమాలు అందించే దానిలో కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో ఉమాదేవి మరియు స్థానిక ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

● సోమవారం సాయంత్రానికి కృష్ణానదిలో సుమారు రెండు అడుగుల నీటిమట్టం తగ్గింది. ఇదే విధంగా తగ్గుముఖం పడితే మంగళవారం మధ్యాహ్నానికి కొంతమేర ముంపు తగ్గే అవకాశం ఉంది.

ప్రమాదపు అంచున్న క్రోసూరు చెరువు

క్రోసూరు, సెప్టెంబరు 2: కాకతీయుల కాలం నాటి పురాతన క్రోసూరు చెరువు వర్షాలు, వరదల తాకిడికి పూర్తిగా నిండిపోయి నిండుకుండలా తయారైంది. వర్షపు నీటి ప్రవాహం రాను రాను ఎక్కువగా ఉండటంతో చెరువు కట్టలు ప్రమాద స్థితికి చేరుకున్నాయి. ఇప్పటికే మంత్రాలమ్మ దేవాలయం వైపు చెరువు కట్టకు గండ్లు పడి కట్టపై గుండా నీరు రోడ్డు మీదకు ప్రవ హిస్తుంది. ప్రమాదాన్ని నివారించటానికి చెరువు కట్టపై అక్కడక్కడ ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. కట్ట బలహీనంగా ఉన్న చోట స్థానికులు కొందరు కాపలా ఉండి అనుక్షణం గస్తీ కాస్తున్నారు. చెరువు కట్టను ఆనుకొని నీరు నిండుగా ఉండటంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ కూడా చెరువు కట్ట బలహీనంగా ఉన్న చోట ప్రమాదం జరగకుండా ఏర్పాట్లు చేయాలని, అప్రమత్తంగా ఉండాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ప్రతి సంవత్సరం ఈ చెరువు కింద వందలాది ఎకరాల మాగాణి భూములు సాగవుతాయి. చెరువు కట్టలను పూర్తిగా పటిష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా పవణ్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు



పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల టౌన్, సెప్టెంబరు 2: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన వ్యవస్థాపకుడు పవన్‌కల్యాణ్ మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, కలకాలం ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. సోమవారం పట్టణంలోని పార్కు సెంటర్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతున్నారని, భారీ వర్షాలకు ప్రజలు నష్టపోయిన ప్రాంతాలకు నేరుగా వెళ్లి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. వైసీపీ నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో శవరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బూసాని రామాంజినేయులు, నక్షత్రపు ప్రసాద్, పులి హరి, మదీన్, మూరబోయిన శ్రీహరి, అబ్దుల్లా, హరీష్, లాల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల మండలంలోని జమ్మలమడకలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి, సోదరుడు అక్కిరెడ్డిలు పాల్గొని జన్మదిన కేక్‌ను కట్ చేశారు. కారంపూడిలో పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

దుర్గి, సెప్టెంబరు 2: దుర్గి బస్టాండ్ సెంటర్లో పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. భారీ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

గురజాల పట్టణ, మండలపరిధిలో పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం మొక్కలు నాటారు. అంకాళమ్మ దేవస్థానం వద్ద కాపు యువసేన ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. రెంటచింతలలో కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు.



సత్తెనపల్లి అన్న క్యాంటీన్ వద్ద కేక్ కట్ చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, బొర్రా వెంకట అప్పారావు

సత్తెనపల్లి, సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు ఆధ్వర్యంలో తాలూకా సెంటర్లోని అన్న క్యాంటీన్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, బొర్రా వెంకటరావులు కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు. పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా వారు మొక్కలను పంపిణీ చేశారు. కాగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను జన సైనికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు, రంగిశెట్టి సుమన్, చౌట శ్రీనివాసరావు, వెంకటస్వామి జనసేన పార్టీ, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్: బృగుబండలో సోమవారం గ్రామ జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి కేక్‌తో పాటు పులిహోరను నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంపిణీ చేశారు.

● నకరికల్లు, సెప్టెంబరు 2: పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో జనసేన మండల అధ్యక్షుడు బత్తిన శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు.

● రాజుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.

మాచవరం, సెప్టెంబరు 2: వేమవరంలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా రెండువేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దాచేపల్లిలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పిడుగురాళ్ల : పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని పట్టణంలోని ఎమ్మెల్యే తనయుడు సాయినిఖిల్, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, జనసేన నేతలు పాల్గొన్నారు.

క్రోసూరు, అచ్చంపేట, పెదకకూరపాడులో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు సింగిల్ విండోలో అనుమతులు

● కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండగ సందర్భంగా వినాయక ఉత్సవాలకు నిర్వాకులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన సింగల్ విండో పద్ధతిలో తప్పకుండా అనుమతులు తీసుకోవాలని జిలా కలెక్టర్ పీ అరుణ్‌బాబు వెల్లడించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో అయన మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత, భక్తి పూర్వక వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు పాటించాలన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసినచోట ముందస్తు చర్యలలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్సవ నిర్వాహకులలో ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అవగాహనా కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 284 మంది దరఖాస్తు చేసుకొన్నారని తెలిపారు. కార్యక్రమములో జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం, రెవిన్యూ డివిజినల్ అదికారులు సరోజినీ, రామనాకాంత్ రెడ్డి, నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొనారు.

ఘనంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 2 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు నరసరావుపేట నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పల్నాడు జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో, నరసరావుపేట పట్టణంలో లాల్ బహదూర్ మార్కెట్ సెంటర్ సెంటర్‌లో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ ముఖ్యఅతిధిగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మరో ముఖ్యఅతిధి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాద్, రాష్ట్రప్రోగ్రామ్ కమిటీ వీరవల్లి వంశీ, బి.అనీల్, అధికార ప్రతినిధి షేక్ అష్రూఫ్, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జనసేన ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.

మద్దిరాల నవోదయకు ఫోర్ స్టార్ అవార్డు

చిలకలూరిపేట, సెప్టెంబరు 2: మండలంలోని మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయంకు ఫోర్‌స్టార్ అవార్డు లభించింది. వివిధ అంశాలలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు అనుసరిస్తున్నందుకు గాను స్వయం ప్రతిపత్తి గల జాతీయ సంస్థ గ్రీహ కౌన్సిల్ (గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హాబిటాట్ అసెస్మెంట్ కౌన్సిల్) ఈ అవార్డును ఇచ్చినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు సోమవారం తెలిపారు. ఈ అవార్డును హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో విద్యాలయం అధ్యాపకులు ఎం.లక్ష్మణరావు తెలంగాణ రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన ద్వారా అందుకున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

వినుకొండ టౌన్, సెప్టెంబరు 2: మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కొని పరారైన సంఘటన పట్టణంలోని కొత్తపేట గ్యాస్ సలీమ్ బజార్‌లో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలను పరిశీలిస్తే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఓమహిళను అడ్రస్ అడుగుతున్నట్లు నటించి మహిళ మెడలో బంగారం గొలుసు లాక్కొని పరారైనట్లు బాధితులు తెలిపారు. ఇదే తరహాలో గత కొంతకాలం క్రితం కొత్తపేట కావలకట్ట వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి వృద్ధురాలిని హత్యచేసిన సంఘటన మరువకముందే మరో సంఘటన పట్టణంలో చోటుచేసుకోవడంపై భ యాందోళనలు నెలకొన్నాయి. బాధితురాలి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎంజీలో మెగా వైద్య శిబిరం

చిలకలూరిపేట, సెప్టెంబరు 2: పట్టణంలోని స్వచ్ఛంద సేవా సంస్థ ఏఎంజీ ప్రాంగణంలో సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కాటూరి మెడికల్ కళాశాల, ఏఎంజీ సంస్థలు సంయుక్తంగా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా సుమారు 800మంది విద్యార్థులకు పరీక్షలుచేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంజీ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి మాట్లాడుతూ ఏఎంజీ సంస్థ వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ జాన్‌డేవిడ్ సతీమణి డాక్టర్ సత్య వేదం జయంతి సందర్భంగా వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వరద ప్రభావం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



వాగు వద్ద అడ్డుపడిన కంపను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు తదితరులు, విజయవాడ వరద బాధితులకు ఆహారం పంపే వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, సెప్టెంబరు 2: వైసీపీ పాలనలో చూపిన నిర్లక్ష్యం వలనే ఈ వరదల ప్రభావం ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని గణపవరం వద్ద వాగును, చిరుమామిళ్ళ గ్రామ పరిధిలోని వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు. గణపవరం ఎస్టీ కాలనీ వాసులు కుప్పగంజి వాగు పొంగి ఇళ్ళల్లోకి నీరు చేరిందని ఎమ్మెల్యేకు వివరించారు. ఆ ప్రాంతంలో ఉన్న వ్యర్థాలను, ముళ్ళ కంచెను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చిరుమామిళ్ళ గ్రామ పరిధిలోని ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. రైతులను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాల్టా చట్టం అమలుకు ప్రయత్నించకపోవటంతో వాగులు కబ్జా అయ్యాయన్నారు. ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా ప్రత్తిపాటి ఆదేశాల మేరకు వాగువద్ద ఉన్న వ్యర్థాలను అధికారులు తొలగించారు.

వరద నష్టంపై కేంద్రం సాయం చేయాలి: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, సెప్టెంబరు 1: ఎడ తెరపిలేని వానలు సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదని, ఈ విపత్తు నుంచి కోలుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తగిన సాయం చేసి ఆదుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని లింగారావుపాలెం, సొలస గ్రామాల్లో వర్షాలకు నీట మునిగిన పత్తి పొలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాను తెలుసుకున్నారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వం స్పందించి పనులు చేసి ఉంటే ఈ రోజు రాష్ట్రంలో ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. గుంటూరు, విజయవాడలాంటి నగరాలు బస్టాండు కూడా మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సొలస-లింగారావుపాలెం గ్రామాల మధ్య రహదారి పూర్తిగా దెబ్బతిందన్నారు. వర్షాల కారణంగా రాష్ట్రానికి పెద్ద ఎత్తున నష్టం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సాయం అందించి రాష్ట్రాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు సాయిబాబు, సొలస, లింగారావుపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వరద బాధితులకు సాయం

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 2 : వరద ముంపులో చిక్కుకున్న విజయవాడ ప్రజలకు తోచిన సాయం అందించటం అందరూ తమ బాధ్యతగా తీసుకోవాలని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి చేశారు. వరద గుప్పెట చిక్కుకున్న ముంపు బాధితులకు పంపిణీ చేయటానికి చిలకలూరిపేట, అద్దంకి నియోజక వర్గాల నుంచి సోమవారం ఆహారం, తాగునీరు తరలించారు. కేఎస్‌ఆర్ మిత్ర మండలి ఆధ్వర్యంలో మూడు వేల మందికి, చిలకలూరిపేట తహసీల్దార్ హుస్సేన్ ఆధ్వర్యంలో వెయ్యి మందికి ఆహారం, నీటి బాటిళ్ళు పంపిణీ చేశారు. ఈ వాహనాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. గ్రానైట్ వ్యాపారం నిర్వహిస్తున్న కేఎస్‌ఆర్ మిత్ర మండలి సభ్యులు ఆహారం అందించేందుకు ముందుకు రావటం అభినందనీయమన్నారు.

పత్తి పొలాలను పరిశీలించిన వ్యవసాయ, రెవెన్యూ అధికారులు

యడ్లపాడు, సెప్టెంబరు 2: మండలంలోని యడ్లపాడు, సొలస, లింగారావుపాలెం, జాలాది, తిమ్మాపురం, మైదవోలు గ్రామాల పరిధిలో వరద ముంపునకు గురైన పత్తి పొలాలను మండల వ్యవసాయాధికారి సీహెచ్ సరిత రెవెన్యూ సిబ్బందితో కలసి సోమవారం పరిశీలించారు. నక్కవాగు వెంబడే ఉన్న పత్తి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణం రైతులు తీసుకోవలసిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఆమె వెంట ఆయా గ్రామాల వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

160 ఎకరాలలో నీట మునిగిన పంటలు

చిలకలూరిపేట, సెప్టెంబరు 2: చిలకలూరిపేట మండలంలో వర్షాల కారణంగా పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. సుమారు 160 ఎకరాలలో పంటలు నీట మునిగినట్టుగా అధికారులు నిర్ధారణకు వచ్చారు. కాగా మండల వ్యవసాయ అధికారి టి.శ్రీలత మండలంలోని మానుకొండవారిపాలెం, వేలూరు గ్రామాలలోని పత్తి, కంది పొలాలను సందర్శించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పంటల బీమా రావాలంటే పంటల నమోదు తప్పనిసరి అని అన్నారు.


● రొంపిచర్ల, సెప్టెంబరు 2: మండలంలోని గ్రామాల్లో వాగుల్లో నీటి ఉధృతి సోమవారానికి తగ్గుముఖం పట్టాయి. రొంపిచర్ల, మునమాక, విప్పర్లపల్లి, ముత్తనపల్లి గ్రామాల్లోని వాగుల ఉధృతి తగ్గింది. దీంతో రాకపోకలు కొనసాగాయి. మండలంలోని వీరవట్నం గ్రామం మొదట్లో వాగు ఇటీవల కురిసిన వర్షాలకు అధికంగా ప్రవహిస్తోంది. నీరు సక్రమంగా ప్రవహించటానికి సర్పంచ్ జాష్టి ప్రసాదు ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో సోమవారం మరమ్మతులను నిర్వహించారు.

పొలం ఇప్పిస్తానని రూ.కోటి మోసం

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 2: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పొలాలు ఇప్పిస్తానని చెప్పి రూ.కోటికి మోసం చేసినట్లు బాధితుడు సోమవారం పల్నాడు జిల్లా క్రైమ్ అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో అదనపు క్రైమ్ ఎస్పీ లక్ష్మీపతి బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నాదెండ్ల మండలం కనపరు గ్రామానికి చెందిన మల్ల రామారావుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పొలాలు ఇప్పిస్తానని చెప్పి గుంజిశ్రీను దేవరకొండ సుబ్బారావు లు తన వద్ద కోటి రూపాయలు తీసుకొని మోసం చేసినట్లు రామారావు ఫిర్యాదు చేశారు. ఈపూరు మండలం బొగ్గరం గ్రామానికి చెందిన ఏడుకొండలు అత్తగిరి వినోద్ కి తాను మధ్యవర్తిగా ఉండి గ్రామస్థుల వద్ద నుంచి రూ.39లక్షలు ఇప్పించినట్లు వినోద్ తిరిగి ఆ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. నరసరావుపేటకు చెందిన షేక్ రమీజా నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన ఆలూరు అంజలీలు ఉత్తమ భర్తలు గ్రూప్ వ్యసనాలకు లోనై తమను ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదులు చేశారు.

క్రీడలతో విద్యార్థులు దృఢంగా తయారవుతారు

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 2: క్రీడలతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్రీడా మైదానంలో హోరాహోరీగా 18వ సబ్ జూనియర్ జూనియర్ బాలబాలికల రాష్ట్ర స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. అండర్ -14 బాలుర విభాగంలో చిత్తూరు మొదటి స్థానం, రెండో స్థానం గుంటూరు, మూడో స్థానం పల్నాడు, బాలికల విభాగంలో మొదటి స్థానం ప్రకాశం, రెండో స్థానం అనంతపూర్, మూడో స్థానం చిత్తూరు, అలాగే అండర్- 19 బాలుర విభాగంలో చిత్తూర్ మొదటి స్థానం, అనంతపూర్ మూడోస్థానం కృష్ణ.. బాలికల భాగంలో మొదటి స్థానం చిత్తూర్, రెండో స్థానం అనంతపూర్, మూడో స్థానం బాపట్ల.. గెలుపొందారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ ఎస్.ప్రకాష్, రాష్ట్ర ఫ్లోర్ బాల్ సంఘం చైర్మన్ రంభ ప్రసాద్, స్టేట్ సెక్రటరీ జోషి టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేంద్ర, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పవన్ వ్యక్తిత్వం ఎంతో గొప్పది: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల, సెప్టెంబరు 2: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యక్తిత్వం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని గణపవరంలో జనసేన పార్టీ యువ నాయకులు మండలనేని చరణ్‌తేజ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సోమవారం పుల్లారావు ప్రారంభించారు. జనసేన రాష్ట్ర నాయకులు పెంటాల బాలాజీ ఆధ్వర్యంలో చిలకలూరిపేట పట్టణంలోని 52 ఎకరాల్లో మొక్కలు నాటారు.

సాతులూరులో దొంగల హల్‌చల్... ముగ్గురిని పట్టుకున్న గ్రామస్థులు

నాదెండ్ల, సెప్టెంబరు 2: మండలంలోని సాతులూరులో ఆదివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో ఒక ఇంట్లోకి దూకిన దొంగలను కాలనీ వాసులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మోటారు బైక్‌పై వచ్చిన ఏడుగురు యువకులు చందవరం సెంటర్‌లోని బేతంచర్ల హనుమంతరావు ఇంటి తాళాలను పగలగొట్టి బీరువాలో ఉన్న వస్తువులను చిందరవందరగా పడవేశారు. హనుమంతరావు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లటంతో ఆ సమయంలో ఎవ్వరూ ఇంట్లో లేరు. అనంతరం చందవరం రోడ్డులో నేరెళ్ల నరేష్‌కు చెందిన ఇంట్లో చోరీ చేసేందుకు గేటు పైనుంచి లోపలకు దూకారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు వెంటపడటంతో ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. మరో నలుగురు పారిపోయారు. వారిని ప్రశ్నించగా తాము గోరంట్ల, పిడుగురాళ్ళ, పలకలూరు గ్రామాలకు చెందిన వారమని తెలిపారు. బీట్ కానిస్టేబుల్ సహకారంతో పట్టుకున్న యువకులను పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్ళారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ పుల్లారావు ఈ ఘటనపై విచారణ చేపట్టారు.



కొండవీడుకోట ఘాట్ మార్గంలో విరిగిపడిన కొండచరియలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

కొండవీడుకోటకు పూర్వ వైభవం తెస్తాం: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, సెప్టెంబరు 2: చారిత్రక కొండవీడుకోటకు తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. భారీ వర్షాలకు కొండవీడుకోట ఘాట్‌మార్గంలో విరిగిపడిన కొండచరియలను ఎమ్మెల్యే ఆదివారం సాయంత్రం పరిశీలించారు. అటవీ, ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఘాట్ రోడ్డుకు దీటుగా కొండవీడుకోట ఘాట్‌రోడ్డు నిర్మాణం చేశామని, ఐదేళ్ళు అయినా చెక్కు చెదరలేదన్నారు. ఐదేళ్ళ వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో కొండవీడుకోట అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని విమర్శించారు. కొండవీడుకోటలో త్వరలోనే ఉత్సవాలు నిర్వహిస్తామని, ఈ ప్రాంతానికి పూర్వవైభవం తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వసాయం కూడా కోరతామన్నారు.

సమన్వయంతో తొలగించాలి: డీఎఫ్‌వో రామచంద్రరావు

కొండవీడుకోట (యడ్లపాడు), సెప్టెంబరు 2: భారీ వర్షాలకు కొండవీడుకోట ఘాట్ మార్గంలో జారిపడిన కొండచరియలను ఆర్‌అండ్‌బీ, అటవీశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా తొలగించాలని డీఎఫ్‌వో రామచంద్రరావు ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కొండవీడుకోట ఘాట్ మార్గంలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను ఆర్‌అండ్‌బి అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. అనంతరం నగరవనంను సందర్శించి అభివృద్ధి పనులపై సమీక్షించారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ బీట్ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.